క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : మాజీ విద్యాశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలో బొత్స సత్యనారాయణ విజయం సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో పేదలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని వాసుపల్లి తెలిపారు. రాజకీయంలో ఎంతో అనుభవం గల బొత్స సత్యనారాయణ విజయం సాధిస్తే వైఎస్సార్‌సీపీతో పాటు పేదలకు కూడా తగు న్యాయం జరుగుతుందని వాసుపల్లి వెల్లడించారు.

ఘనంగా తేరు ఊరేగింపు



మేరీమాత స్వరూపాన్ని తేరులో ఊరేగిస్తున్న క్రైస్తవులు

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి పునీత పేతురు ప్రధాన దేవాలయంలో పారిస్ పాస్టిల్ కౌన్సిల్, విచారణ గురువులు ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం తేరు మహోత్సవం నిర్వహించారు. తేరు ఉత్సవంలో దేవవర ప్రసాదాల మాత అవతారంలో దేవమాత తేరు (పల్లకి) ఉత్సవం నిర్వహించారు. స్లీవ్‌గుర్తువీధి, రేబరిల్, సిరిల్ మాన్యువల్, డయాస్, నికోలస్ తదితర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న విల్లూరి భాస్కరరావు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు శనివారం పాతనగరంలో గల స్వామి వివేకానంద సంస్థలో పేదలు, ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు వస్త్ర, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివేకానంద సంస్థకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, బి. మంగరాజు, నిమ్మ శ్రీనివాస్, సురేష్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ బిల్డింగ్ సమీపంలో స్వల్పంగా మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తాటిచెట్లపాలెం : ఎల్‌ఐసీ బిల్డింగ్ ఎదురుగా గల రైల్వే క్వార్టర్స్ సమీపంలో శనివారం రాత్రి స్వల్ప మంటలు చెలరేగాయి. ఈ ప్రాంతంలో గల చెత్తకు ఆకతాయిలు నిప్పు పెట్టడం వల్ల ఈ మంటలు వ్యాపించాయని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

మా ప్రాంతానికి బస్సు నడపరూ..

ఆర్టీసీ బస్సులో ప్రయాణించండి.. సుఖవంతమైన ప్రయాణం సాగించండి. ఇది అందరికీ తెలిసిన విషయమే. అసలు ఆర్టీసీ బస్సే లేకపోతే సుఖవంతమైన ప్రయాణం ఎలా సాగుతుందో అధికారులకే ఎరుక. ఫలితంగా ఆటోల దందా మితిమీరుతోంది. ఇష్టానుసారంగా ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నారు. బస్ పాస్‌లు తీసుకున్నా.. బస్సు సౌకర్యం లేకపోతే ఇటు విద్యార్థులు.. అటు ప్రభుత్వ.. ప్రైవేట్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోవల్సి వస్తోంది.

- పాతనగరవాసుల వేడుకోలు
- ఇక్కడ అనేక ప్రాంతాలకు ఈ సౌకర్యం లేక అవస్థలు
- ప్రైవేట్ వాహనాలు.. ఆటోలనే ఆశ్రయిస్తున్న స్థానికులు



బస్సులు అందుబాటులో లేక ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు



అప్పట్లో నడిచిన ఆర్టీసీ సర్వీస్ (ఫైల్)



దాబాగార్డెన్స్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నగరంలోనే కాదు.. జిల్లాలోని మారుమూల ప్రాంతాలు.. గ్రామాలకు సైతం బస్సు సౌకర్యం కల్పించింది. అంత వరకూ బాగానే ఉంది. అయితే నగర నడిబొడ్డు.. విశాఖకు ఆయువు పట్టులాంటి పాతనగరంలోని పలు ప్రాంతాలకు ఇప్పటికీ బస్సు సౌకర్యం లేదంటే విడ్డూరమే అని చెప్పక తప్పదు. నగరం విస్తరిస్తున్నా.. వాహనాల రాకపోకలు జోరుగా సాగుతున్నా.. పాత నగరం రెల్లివీధి, జబ్బరతోట, పెయిన్‌దొరపేట, కోడిపందాలవీధి, చెంగల్రావుపేట, జాలారిపేట, కదిరి దానప్ప వీధి, గొడారిగోతులు, ఏవీఎన్ కాలేజీ తదితర ప్రాంత వాసులు ఆర్టీసీ బస్సుకు నోచుకోవడం లేదంటే విచిత్రంగా ఉంటుంది. ఆయా ప్రాంతవాసులు నగరంలోని పలు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే ఇటు కలెక్టర్ కార్యాలయానికి గాని.. అటు టౌన్ కొత్తరోడ్డుకు గాని వెళ్లాల్సిందే. అంత శ్రమ పడలేక చాలా మంది ఆటోలనే ఆశ్రయిస్తున్నారు. కొంత మంది వారి ద్విచక్ర వాహనాలను వినియోగిస్తున్నారు.

బస్ పాసులున్నా..

ఈ ప్రాంతంలో అనేక మంది ఆర్టీసీ బస్ పాసులు తీసుకున్నా ఫలితం లేదంటున్నారు. ఇక్కడి నుంచి ఉద్యోగం, పాఠశాల, కళాశాలకు వెళ్లాలంటే అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. బస్సుల్లో వెళ్లే కన్నా ఇరవై, ముప్పై రూపాయలు పెట్టి ఇటు కలెక్టర్ ఆఫీసో.. అటు టౌన్ కొత్తరోడ్డుకో ఆటోలపై వెళ్లి అక్కడి నుంచి బస్సులో గమ్యస్థానానికి వెళ్లిపోవచ్చని అంటున్నారు.

గతంలో 11సీ..13ఏ సర్వీసులు..

దశాబ్దన్నర కిందటి వరకు ఆర్టీసీ బస్సులు నడిచేవి. 11సీ, 13ఏ సర్వీసులు హెచ్‌బీ కాలనీ నుంచి జగదాంబ, కేజీహెచ్ అప్‌రోడ్డు, కలెక్టర్ కార్యాలయం, రెల్లివీధి, ఏవీఎన్ కాలేజీ మీదుగా పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డుకు చేరి అక్కడి నుంచి పాత పోస్టాఫీస్ వెళ్లేవి. అలాగే తిరుగు ప్రయాణంలో పాతపోస్టాఫీస్ వద్ద బయలుదేరి, లక్ష్మీటాకీస్ జంక్షన్, టౌన్‌కొత్తరోడ్డు, రాజా రామ్మోహన్‌రాయ్ రోడ్డు మీదుగా ఏవీఎన్ కాలేజీ అప్‌రోడ్డు, రెల్లివీధి, కలెక్టర్ కార్యాలయం, కేజీహెచ్ డౌన్, లేపాక్షి జంక్షన్ మీదుగా రాకపోకలు సాగేవి. రూట్ నంబరు బస్సులు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వేళల్లో నడిచేవి. ఆ బస్సుల వల్ల ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. రెల్లివీధి, పెయిన్‌దొరపేట, కోడిపంద్యాలవీధి, జబ్బరతోట తదితర ప్రాంతాలతో పాటు ఏవీఎన్ కళాశాలలో చదివే విద్యార్థులు ఈ సర్వీసులను ఉపయోగించుకునేవారు. తర్వాతి కాలంలో ఈ సర్వీసులను అధికారులు ఆపేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాంతవాసులు ఆర్టీసీ బస్సును నోచుకోవడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి బస్సులు నడపాలని పలువురు కోరుతున్నారు. ప్రత్యామ్నాయం చూపాల్సిన బాధ్యత అధికారులదేనని పాతనగర వాసులు అభ్యర్థిస్తున్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలతోనే నిరాశ్రయుల వసతిగృహాలు



నిరాశ్రయుల వసతి గృహం నిర్వాహకులతో సెయింట్ జోసెఫ్ కళాశాల విద్యార్థినులు

సీతమ్మధార: సుప్రీం కోర్టు ఆదేశాలతోనే దేశంలోని అన్ని రాష్ట్రాల్లో నిరాశ్రయుల వసతి గృహాలు ఏర్పాటయ్యాయని ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు పేర్కొన్నారు. జ్ఞానాపురం సెయింట్ జోసఫ్ మహిళా కళాశాలకు చెందిన 25 మంది బీఎస్సీ ఫైనలియర్ విద్యార్థినులు శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్ దరి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ-జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహాన్ని సందర్శించారు. స్వచ్ఛంద సంస్థలు చేసే కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను తెలుసుకునేందుకు గాను కేస్ స్టడీస్ నిమిత్తం వారు వచ్చారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ జీవీఎంసీ భవనాల్లో పలు స్వచ్ఛంద సంస్థలు నిరాశ్రయులైన మహిళలు, పురుషుల కోసం నిరాశ్రయుల వసతి గృహాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. టీఎస్సార్ కాంప్లెక్స్, భూపేష్ నగర్, మహారాణి పేట, పెదవాల్తేరు, ఆరిలోవ, బుచ్చిరాజుపాలెం తదితర ప్రాంతాల్లో ప్రస్తుతం నిరాశ్రయుల వసతి గృహాలు ఉన్నాయని చెప్పారు. రోడ్లపై తిరిగే నిరాశ్రయులను రెస్క్యూ ఆపరేషన్ ద్వారా వసతి గృహాలకు తరలించి పునరావాసం కల్పిస్తున్నామన్నారు. ఇంట్లో చెప్పకుండా పారిపోయి వచ్చే వారికి కూడా వసతి గృహాల్లో ఆశ్రయం కల్పించి, తరువాత వారిని స్వస్థలాలకు పంపుతున్నామని వివరించారు. కార్యక్రమంలో వసతి గృహం ప్రతినిధి జ్యోతిర్మయి, కళాశాల ప్రతినిధి సిస్టర్ దీపాలి, కేర్‌టేకర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధన దిశగా సాగాలి



జ్యోతి వెలిగించి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి



విద్యార్థికి వైద్య పరీక్షలు చేస్తున్న సీపీ బాగ్చి

అల్లిపురం : విద్యార్థులు లక్ష్యసాధన దిశగా ముందుకు వెళ్లాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. సూర్యాబాగ్ పోలీస్ క్వార్టర్స్‌లో గల పబ్లిక్ అండ్ పోలీస్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ (పాపాహోం) కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సంపూర్ణ ఆరోగ్యంతో లక్ష్య సాధన దిశగా అందరూ ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థి దశ ప్రాముఖ్యతను వివరించారు. పాపాహోం అభివృద్ధికి తోడ్పడుతున్న కమిటీ సభ్యులను, దాతలను సీపీ అభినందించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని అత్యున్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా సీపీ స్వయంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాపాహోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ అస్లామ్ అరిఫ్, కార్యదర్శి వీఎస్ ప్రకాశరావు, కోశాధికారి రమేష్‌చంద్ జైన్, హెల్త్ క్యాంప్ కో ఆర్డినేటర్ డాక్టర్ కేబీ స్వామి, పాపాహోం సభ్యులు ఎంవీ రాజశేఖర్, ఎంవీవీ సత్యనారాయణ, కృష్ణారావు ఆచారి, భాస్కర శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో 'వన్ క్యాడెట్ వన్ ప్లాంట్'



కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, అధ్యాపకులు

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం 'వన్ క్యాడెట్ వన్ ప్లాంట్' కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి కె. గీతాంజలి నేతృత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. చెట్లను కాపాడడంపై అవగాహన కల్పించే విషయమై ఈ కార్యక్రమం నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తెలిపారు. చెట్లు ప్రకృతి ప్రసాదించిన అమూల్య వరమని, చెట్ల వల్లే ఈ పచ్చని భూమి, మన జీవితం ఆనందంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, డాక్టర్ కేఎల్ శిరీష, డాక్టర్ జె. లావణ్య, ఎస్. అనుదాధ, అధ్యాపక బృందం, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

గోవింద్ రోడ్డులో ప్రయాణానికి అవస్థలు

తరచూ నిలిపేస్తున్న డంపర్ లారీతో ఇక్కట్లు



డంపర్ బిన్ లారీ పక్కగా ముక్కు మూసుకుని వెళ్తున్న మహిళ

అల్లిపురం : జీవీఎంసీ డంపర్ లారీ సిబ్బంది నిర్వాకంతో అల్లిపురం గోవింద్ రోడ్డు ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రతి రోజు ఉదయం 10.30 గంటలకు ఇక్కడి డంపర్ బిన్‌లోని చెత్త తరలించేందుకు వచ్చే ఈ లారీ మధ్యాహ్నం 12 గంటలైనా తీయకపోవడంతో పాదచారులు, వాహన చోదకులు అక్కడి ఇరుకు రోడ్డులో ప్రయాణించలేక అవస్థలు పడుతున్నారు. అలాగే చెత్తతో నిండిన డంపర్‌బిన్ వల్ల దుర్గంధం అలుముకుని ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం బల్లిగిరి ఆలయానికి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారికి అడ్డంగా లారీ నిలిపివేయటంతో భక్తుల రాకపోకలు నిలిచిపోయాయి. మరోపక్క గోవింద్ రోడ్డులో నిర్మాణ సామగ్రి తిరిగే దారిలో వేయటంతో ద్విచక్ర వాహనాలు కూడా నడపలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోవింద్ రోడ్డు పలు ప్రాంతాలైన మిరపకాయల వీధి, నారాయణ వీధి, బృందావన్ జంక్షన్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో అక్కడ డంపర్ లారీ అడ్డుగా ఆపేసి ఉంచడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

క్రైస్తవుల శాంతియుత ర్యాలీ



నిరసన ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మత వివక్షతో కూడిన చట్టాలు, చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా క్రైస్తవ ప్రగతి పరిరక్షణ సమాఖ్య (సీపీఐసీ) ఆధ్వర్యంలో శనివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ మైనారిటీల పట్ల వివక్ష ప్రదర్శిస్తూ 1950 ఉత్తర్వులకు నిరసగా జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్కులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మట్లాడుతూ 1960లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ క్రైస్తవ మైనారిటీలకు మాత్రమే వర్తించేలా మత స్వతంత్ర నిరోధక చట్టాలకు తెరలేపారని గుర్తు చేశారు. ఫలితంగా ఆగస్టు 10న బ్లాక్‌డేగా ప్రకటించి దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోను మతం మారిన క్రైస్తవ మైనారిటీలకు కుల నిర్మూలన చేస్తూ అదర్ క్రిస్టియన్ పేరిట ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పిస్తున్న ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్న చట్టాల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. అంతకు ముందు అధిక సంఖ్యలో క్రైస్తవులు, సమాఖ్య సభ్యులు పలు ప్రాంతాల మీదుగా శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు ఎం.సుధాకర్‌పాల్, జేమ్స్ కుంపట్ల, కె.ఈశ్వర్ డేనియల్, ఎస్.హనీ జాన్సన్, బిషప్ ఎంఏ పాల్, పలు క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆధ్మాత్మికవేత్త అప్పలస్వామికి సత్కారం



అప్పలస్వామిని సత్కరిస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్, అప్పారావు తదితరులు

దాబాగార్డెన్స్: ప్రముఖ సంఘ సేవకుడు, ఆధ్యాత్మిక వేత్త జి. అప్పలస్వామిని స్వామి వివేకానంద సంస్థ శనివారం ఘనంగా సత్కరించింది. సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, ఉమ్మడి రాష్ట్రాల రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్, పలువురు సంస్థ సభ్యులు అప్పలస్వామిని ఘనంగా సత్కరించి, పాదపూజ చేశారు. ఈ సందర్భంగా సూరాడ అప్పారావు మాట్లాడుతూ ఎందరికో జ్ఞానాన్ని అందించి, జోడుగుళ్లపాలెంలో గ్రామదేవతల ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్నారన్నారు. నామ సంకీర్తనలో ఎందరినో ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దిన అప్పలస్వామిని సన్మానించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పి. నల్లరాజు, వి. దానయ్య, చెన్నా ఎల్లాజీ, చెన్నా అప్పారావు, అప్పారావు, సంస్థ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో పాల్గొన్న ఉభయదాతలు



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

6వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు..

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు శనివారం 6వ రోజుకి చేరాయి. అమ్మవారికి విశేషపూజ నిర్వహించారు. వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. 30 మంది భక్తులు విశిష్ట శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లే.. పార్కింగ్ ప్లేస్‌లు





వాహనదారులు ఫుట్‌పాత్‌లను కూడా వదలడం లేదు. నడిరోడ్డుపైనే కొందరు వాహనాలు నిలిపితే.. ఇంకొందరు కార్లను ఏకంగా ఫుట్‌పాత్‌లు ఎక్కించేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే దాబాగార్డెన్స్ ప్రాంతంలో కారును ఒక వైపు ఫుట్‌పాత్ ఎక్కించి పార్కింగ్ చేసి వెళ్లిపోయారు. ఇలా నగరంలో చాలా ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు కూడా పార్కింగ్ ప్రదేశాలుగా మారిపోతున్నాయి.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అలరించిన డ్యాన్స్ ఫెస్టివల్



డ్యాన్స్ ఫెస్టివల్‌లో పాల్గొన్న కళాకారులకు జ్ఞాపికలు అందజేస్తున్న అతిథులు

సీతంపేట: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన డ్యాన్స్ ఫెస్టివల్ అలరించింది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 50 మందికి పైగా నృత్య కళాకారులు జానపద, కూచిపూడి, కథక్ ప్రదర్శనలు చేశారు. వీరిని తీర్చిదిద్దిన నాట్య గురువులు ఆర్.రజని, అనిల్ తెలికిచర్ల, సౌమ్య, మంగళ దివ్య, బి.సుధాపౌర్ణిమ, కరణం కుమార్‌లను అతిథులు మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, బాదంగీర్ సాయి చేతుల మీదుగా సత్కరించారు. నృత్యంతో అలరించిన చిన్నారులకు అతిథులు జ్ఞాపికలు అందజేశారు.

'హాస్యానందం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంపాదకుడు రాము

సీతంపేట: హాస్య కథా రచయిత గంగాధర్ వడ్లమన్నాటి సంకలనం చేసిన హాస్యానందం పుస్తకావిష్కరణ సభ శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథి హాస్యానందం సంపాదకుడు పి.రాము పుస్తకాన్ని ఆవిష్కరించారు. మొదటి ప్రతిని కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ద్విభాష్యం మాట్లాడుతూ హాస్యం రాయడం చాలా కష్టమైన ప్రక్రియని అన్నారు. అటువంటికి 38 మంది రచయితలు రచించిన సుమారు 350 కథలతో పుస్తకాన్ని సంకలనం చేసిన గంగాధర్‌ను అభినందించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు పుస్తక సమీక్ష చేశారు. మేడా మస్తాన్‌రెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.వి.జి.శంకరరావు, ఎం.సుగుణరావు, కోనె నాగవెంకట ఆంజనేయులు, బి.రత్నకుమారి, వాణి శ్రీనివాస్, సుసర్ల ఆర్వేశ్వరశాస్త్రి, పాల్గొన్నారు.

ఔషధ గుణాల మొక్కలు పెంచుదాం

తగరపువలస: ఔషధ గుణాలు కలిగిన మొక్కలతో పాటు దేశీయ ఆకుకూరలు, కూరగాయల మొక్కలు నాటుదామని గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం తెలిపారు. శనివారం ఆనందపురం మండలం కేజీబీవీ ఆవరణలో ఆయన విద్యార్థినులతో మొక్కలు నాటించే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడారు. భవిష్యత్తు తరాల కోసం సామాజిక వనాలు పెంచుదామన్నారు. అధ్యాపకురాలు సంధ్యా ప్రసాదిని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తమ విద్యార్థులు కృషి చేస్తున్నారన్నారు. గ్రీన్ క్లైమేట్ టీమ్ అందించిన విత్తనాలతో కేజీబీవీని నందనవనంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీలక్ష్మి, లక్ష్మి, షీలా, టి.తారక, సరస్వతి, బి.స్వరాజ్యలక్ష్మి, అనురాధ, కుమారి, గ్రీన్ క్లైమేట్ కార్యకర్తలు జనపరెడ్డి రవితేజ, పిల్లా కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.